# చిన్నబోయిన చెన్నపట్నం

'చెడి చెన్నపట్నం చేరమ'నే వారు పూర్వం పెద్దలు అన్న ఆ మాట వూరికే పోనీయట మెందుకని కలకత్తా మెయిలులో వచ్చి చెడీ చెన్నపట్టణం చేరాను. మెయిల్‌లో నే నెక్కిన మహాత్మ్యమే నేమో — ఆరోజు రాత్రి మెయిలు కావలి దాటాక పట్టాలు తప్పి పరిగెత్తబోయింది. మదగజంలాంటి కెనేడియన్ రైలు యింజనుకి తగిన మావటివాడు నాటి మెయిల్ డ్రైవరు. పట్టా తప్ప పారిపోతున్న రైలుబండిని 'ఖడేరావ్' అన్నాడు. కాస్తంతలో తప్పిపోయింది కాని, లేకపోతే యీ 'గుంటూరు గ్రామ కాపురస్థుడు' ఆరోజు కావలిలో అవులించి మృత్యువుని కావులించుకొనేవాడే!

అసలీ ప్రయాణమే చేయకపోగును. చిన్నప్పటినుంచీ అలవాటుపడిన గుంటూరు-కొరిటిపాడు రోడ్డుమీదనే పోజాలు కొట్టుతూ తిరుగుతూవుందును — హైకోర్టు ఆగమనానికి మావూరు యింతగా మురిసిపోతుంటే, దాని నిష్క్రమణానికి చెన్నపట్నం ఎంతగా చిన్నబోతోందో చూసి సంతోషిద్దామనే చిలిపిబుద్ధి నా బుర్రలో పుట్టకపోతే!

ఎందుకైనా మంచిదని ముందుగా మైలాపూరికి వెదుక్కుంటూ వెళ్ళి తెలుగువాళ్ళ హోటల్‌లో అరవవాళ్ళు పెట్టిన అన్నం తిన్నాను. హైకోర్టుకి రెక్కలు వస్తే అది లేవి ప్లీడర్లదొక్కటే కాబట్టి వాళ్ల సంగతి ఎలావుందో తెలుసుకొందామని తొందర పుట్టింది. ఆ వుద్దేశంతో వూరంతా తిరిగి సాయంకాలానికి లజ్ కార్నరు బస్సుస్టాండులో చేతిసంచి పట్టుకు నిల్చున్నాను,— వచ్చే పోయేజనాన్ని, ఆగకుండా పోయే బస్సుల్నీ చూస్తూ.

"ఏమండి రామారావుగారు — ఇక్కడ కూచ్చున్నారేం?"... నా వెనక ఎవరో ఎవరినో ప్రశ్నించారు.

"ఆఁ! ఏమీ లేదు. ఊరికనే, కోర్టు కూడా లేదుగా పొద్దుణ్ణించి యింట్లో కూచునీ కూచునీ విసుగెస్తే, యింతకుముందే యిలా వచ్చాను. చెయ్యటానికి ఏమీ పని లేక, వూరికే చూస్తున్నాను" అన్నాడు రామారావుగారు. ఆయన నలభయ్యో పడి దాటిన మనిషి. చాలా కాలంపాటు లేమిని దాచటానికే శక్తినంతా ధారపోసిన వ్యక్తిలా కనిపిస్తున్నాడు.

"ఇంతకీ మీరు గుంటూరు ఎప్పుడు వెళ్తున్నారు?" అవతల వ్యక్తి అడిగాడు; అంతకంటె అడగటానికి మరేదీ తోచక.

"వెళ్తానండీ! మా అబ్బాయిని పంపించాను ఇల్లు చూడమని. వాడి దగ్గిరనుంచి వుత్తరం ఏదన్నా వస్తుందేమోనని చూస్తున్నాను."

"అది సరే కానిండి — హైకోర్టు గుంటూరులో పెట్టటం జరగకపోవచ్చునటగా?"

"అదేమిటండోయ్! కొంపముంచేశారే హైకోర్టు యిక్కడా వుండక, గుంటూరికీ పోక మధ్యలో ఏమైపోతుందంటారు? బట్వాడా కాని వుత్తరంలా ఏ 'డెడ్ లెటర్ ఆఫీసు'కో చేరిపోదుగదా?"

"అబ్బ! అదేమీ కాదండి హైకోర్టు గుంటూరులో పెట్టాలని మన ఆంధ్ర ఎసెంబ్లీ చేసిన నిర్ణయానికి యింకా కేంద్ర ప్రభుత్వ ఆమోదం రాలేదట. ఆమోదం రావటానికి యింత ఆలస్యం అవటాన్ని బట్టి 'ఢిల్లీ దేవుళ్ళ'కి గుంటూరుమీద ఏదో కానరాని కోపం వుందనీ, ఆ కోపంకొద్దీ వాళ్లు ఆ వూరికి యీ భోగం పట్టనివ్వరనీ అందరూ అనుకొంటున్నారు!"

"ఆఁ! అదేమిటండీ- అర్థంలేనిమాట. ఒక చెంపని గుంటూరులో భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నట్లు పత్రికల్లో ప్రతిరోజూ పడుతోంది కదండి?"

"అదేమో! ఈ వూళ్లో స్వంతయిళ్లూ ఆస్తులూవున్న పెద్దపెద్ద ప్లీడర్లలో చాలామంది, హైకోర్టు యిక్కణ్ణుంచి అసలు కదలనే కదలదని అనుకొంటున్నారట."

"కదలకూడదని వారికోరిక లెండి. కదిలితే వాళ్లు కష్టపడి ఆర్జించిన ఆస్తులకి విలువ తగ్గిపోతుందనేదిగులుకొద్దీ వారలా అనుకొంటున్నారేమో!"

"అయితే కావచ్చేమో-ఈవూరిప్లీడర్లలో చాలామంది కొత్తచోట ప్రాక్టీసు మళ్ళీ మొదలుపెట్టాలంటే భయపడుతున్నారట్లే వుంది?"

"భయమెందుకండీ! ఇప్పుడు మేమంతా వున్నామంటే ఎంతలేదన్నా హైకోర్టులో ప్రాక్టిస్ చేసినవాళ్లంకదా? మాకు వున్న ధాటీ, మాకు వున్న ఆ 'యిదీ' ఆ వూళ్లల్లో జిల్లా కోర్టుల్లోనూ, మునసబుకోర్టుల్లోనూ కొట్లాడుకునే ప్లీడర్లకి ఎలా వస్తుందండీ!- మీదంతా చాదస్తంకాని."

"మీ రేమిటో అంటున్నారు, కాని అక్కడి ప్లీడర్లకువున్న స్థానబలం మీకు రావటానికి ఎన్నేళ్లు పట్టుతుంది? స్థానభ్రంశం జరిగితే నఖదంతకేశములు రాణించవని 'పంచతంత్ర'కారులు అన్నారు కాని అంతకంటె మిన్నగా ప్లీడర్లు, డాక్టర్లు రాణించలేరు ... ఏమోలెండి! మన కెందుకొచ్చినగొడవ వెళ్ళొస్తాను. అందరూ కులాసాయేనా?"

"ఆ! ఆ! వెళ్ళిరండి."

అంతటితో వాళ్ల సంభాషణా ఆగిపోయింది. ఇదంతా వింటూవుంటే, యిష్టం లేనికోడలు అత్తవారింటికి పోయేముందు పెట్టే నస యిట్లాగే వుంటుందికదా అనిపించింది.

బీచికైనా పోదామని కచ్చేరీరోడ్డు వెంట పడిపోతున్నాను. వేసవిసాయంకాలం కావటంచేత కాబోలు — పిల్లా మేకా అందరూ పుసిళ్ళు వచ్చినట్లు యిళ్ళల్లోనుంచి బయటకు బిలబిలా వచ్చేస్తున్నారు. మస్తానయ్య వురుసు రోజున మా వూరి వీథులు ఎలా వుంటాయో యీ వూరివీథులు ప్రతిరోజూ అల్లా వుంటాయి కాబోలునని విస్తుపోతున్నాను.

"అబ్బబ్బ! ఇవ్వాళ ఏం ఎండ కాసిందండి — ఏం ఎండ కాసిందండీ! పిల్లలూ మేము అట్టుడికినట్లు వుడికిపోయామంటే నమ్మండి..." నాముందు మూడు గజాల దూరంలో నడుస్తున్న ఒక జట్టు పంచకట్లవారిలోనుంచి ఒక కంఠం.

గుంటూరు ఎండకు అలవాటుపడిన నా ప్రాణానికి యీ వేళ యిక్కడ వూటీలో వున్నట్లుంది. వీళ్లేమిటి చెప్మా-యీమాత్రం ఎండకే యింత హడిలిపోతున్నారు!

"అదేమిటండీ యీమాత్రానికే యింత కంగారు పడిపోతుంటే రేపు గుంటూరు ఎండకి ఎట్లా తట్టుకుంటారు?" అడగవలసిన ప్రశ్న అడిగాడు, అ జట్టులో మరొకడు.

"అబ్బబ్బ! మీరూ ఎత్తారా గుంటూరు సంగతి? అదేం చిత్రమో కానిండి—పొద్దున నిద్దరలేచింది మొదలు రాత్రి పడుకోబోయేలోగా కనీసం ఒకవందమంది అయినా అడుగుతున్నారు—'మీరు గుంటూరు వెళ్ళుతున్నారుకదా?' అని. వెళ్ళక ఏం చేస్తాం చెప్పండి! బతికినన్నాళ్లు యిక్కడ ప్లీడరు గుమాస్తాగిరి వెలిగించి యిప్పుడు అర్ధాంతరంగా యింకో వుద్యోగం చెయ్యమంటే మా తరమా? హైకోర్టూ వెళ్ళిపోయి,

(53-వ పేజీ చూడండి)

# ★ చిన్నబోయిన చెన్నపట్టణం ★

(11- వ పేజీ తరువాయి)

ప్లీడర్లూ వెళ్లిపోతే, యింక యిక్కడ మా ముఖం చూసేవాళ్లు ఎవరు వుంటారు? అదీగాక - ఇన్ని సంవత్సరాలు యిక్కడ చాలీ చాలని ఆదాయంతో రోజురోజుకీ పెరిగే సంసారంతో జీవితం గడుపుకొచ్చాం. ఇప్పటికైనా మనదేశానికి పోయి, ఆపడే తిప్ప లేవో, మనవాళ్ళ మధ్యనే పడితే అక్కడికి అదొక రకం తృప్తిగా వుంటుంది ఏమంటారు?"

"నిజమేలెండి! మీరు అన్నట్లు మన వూళ్ళల్లో మెతుకులు తిని బతికినా యిక్కడ పరమాన్నం తిన్నదానికంటే మిన్నగా వుంటుంది మీరంతా గుంటూరుకే వెళ్ళాలి కాని, మీకు అక్కడ అంత కష్టపడవలసిన అవసరం ఏమీ వుండదు. అక్కడ ప్లీడరు గుమాస్తాలకి గిరాకీ చాలా ఎక్కువగా వుందట. గుమస్తా అనేవా డెవడైనా రోడ్డు మీద కనిపించాడంటే, కోడిపిల్లల్ని గద్దలు తన్నుకుపోయినట్లు తీన్నుకుపోతున్నారట-ప్లీడర్లు. నిన్న మాయింటి పక్కభాగంలో వున్న వారి బంధువు ఒకాయన గుంటూరు నుంచి వచ్చాడు' ఆయన చెప్పాడు—అక్కడ నెయ్యి, బియ్యం, వగైరా ధరలు ప్రతి ఏడాదికంటే కూడా యీ ఏడు చాలా తక్కువగా వున్నాయట అందుచేత మీలాటివాళ్ళు అక్కడికి వెళ్ళితే అన్ని విధాలా సుఖపడతారు. ఈ మహా పట్టణంలో యిలా ఒంటరి బతుకు బతికేకన్నా, మన వూళ్ళో మనవాళ్ల మధ్య మసులుతూ హాయిగా గడపొచ్చు...మిగిలిన అన్ని విషయాలలోనూ గుంటూరు గొప్పగానే వుంటుంది కానీండి - దాని దుంపతెగ ఎండ మాత్రం మహా దండిగా కాస్తుంది దాని కొక్కదానికి తట్టుకోగలిగితే గుంటూరు గంధర్వలోకం కదండీ .."

ఆ తరువాత వాళ్లు యింకా ఏమేమి మాట్లాడుకున్నారో నాకు వినటానికి ఆస్కారం లేకపోయింది. సంభాషణ యీ దశలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఏంబ్యులెన్సు కారుకి దారిచెయ్యటంకోసం జనంలోనుంచి నేనొక మూలకి కదిలి పోయాను. కారు దాటిపోయేలోగా నాముందు జట్టు దూరమైపోయింది. వారి కోసం వెతుకుతూ నేనూ ముందుకు పోతున్నాను.

"ఏమండీ! వెంగ్రలాయ చెట్టిగారూ? - మా మైలాపూరికి దా వచ్చివుంటిరె? - ఎల్లోరుం సౌక్యందానే?"...రవ్వల దుద్దులు పెట్టుకొన్న ఒక సెట్టిగారు, జీరాడే జరీ కండువాతో చమురోడే భార్యారత్నంతో నడుస్తున్న మరొక చెట్టిగారిని పలుకరించారు

"చుమ్మావస్తిమి! మన ఆండవాళ్ళు బీచికిదా పోయి విడు స్తామంటె సరిదా అంటిని. బిడ్డు అంతా మన సొంతూరు పోయివుంట్రి. మేముదా వీట్లో రెండుపేరు ఐపూడిస్తిమి. నేటికి బార్దసాదికోయిలకు పోయివుంటమి. ఇనికి గబాలీగుడికి పోలామా అని తలస్తిని. మన ఆండవాళ్లు ఇనికి కట్టాయం బీచికిదా పోవాలా అని నిండా గలటా సేస్తారు. 'సరి; అప్డియేసెయ్' అని యిట్లదా వస్తావుంటిమి అదిసరి - మీకుదా సెరయా వీడువుందే- మైలాపూరులో ఇంద ఆంధ్రా హైకోర్టుదా పోయివుడుస్తే, మీయింట్లో వాడుగవుండే తెలుంగుకారుగా అంతా గాలీసేసి పూడుస్తురు అప్పొ...మనకిదా కొంచెం మిన్నాలియే కొల్లివిటా, నంబ కడైలో యిరికిరె నాల్ అంజిపేర్ ఆసామిగళుకి సౌకర్యమాన వీడు వేణుం. నంబసమాచారందా గొంచెం గమనంలో పెట్టుకోమీ. వీడుగాలి ఆచవుడనే కొల్ళివిడు."

"సెయ్యుంగో! ఆనా - మిన్నాలియే బంగారయ్యశెట్టిదా నాకు సెప్పి పెట్టి వుండాడు. సూస్తాం. యదావదు పోరువళి పణ్ణివుట్టి, మీకుదా రెండు మూడు పోర్షన్ యిప్పిస్తును. పోయి వస్తానండి. అడియేన్ దాసన్!"

చెట్టిగార్ల జట్లూ విడిపోయాయి. చడీ చప్పుడూ లేకుండా నేను బీచిలో చేరి ఒకమూలగా పోయి కూర్చున్నాను. సముద్రుడు పాడే సంగీతానికి అపశృతిగా రేడియోలోనుంచి కర్ణాటక సంగీతం పొర్లుకొస్తోంది.

"ఏమండీ! మనం యిల్లు మారితీరాలండి. చచ్చిపోతున్నాను - పగలల్లా. మీకేం - మీరు హాయిగా ఆఫీసులో ఫానుకింద కూచుని కునుకుతీస్తుంటారు. గాలి ఆడని ఈ కొంపలో కుంపటిదగ్గర పడి నేను చచ్చిపోతున్నాను"—చల్లగాలికి మొఖం వాచి వున్న ఒక యిల్లాలు, చిరాకు తగ్గివున్న యింటాయనకి,దరఖాస్తు పెట్టుకొంటోంది.

"మారదాం: మారదాం! ఇదుగో యీ హైకోర్టు వెళ్ళిపోయిందంటే వూళ్లో యిళ్లన్నీ ఖాళీయే. అప్పుడు మూడంతస్థుల మేడే ముప్ఫై రూపాయల అద్దెకు దొరుకుతుంది. ఇంకొక్క రెండు నెలలు ఓపిక పట్టు"—భార్య పెటుకొన్న దరఖాస్తుమీద భర్తగారి రిమార్కు

ఆతరువాత వాళ్ళ సంభాషణ అట్లా అట్లా తిరిగి తిరిగివచ్చి చివరికి అలవాటైన పోట్లాటల్లోకి దిగింది. 'స్వర్గాని కెళ్ళినా సవతిపోర'ని చెన్నపట్నాని కొచ్చినా మొగుడూ పెళ్ళాల పోట్లాటలే వినక తప్పనందుకు నన్ను నేను తిట్టుకొంటూ, యిసక దులుపుకొనే మిషతో లెంపలేసుకొని సంచి పట్టుకొని చక్కా వచ్చేశాను

బస్సు స్టాండులో జనం కిటకిటలాడుతున్నారు. బస్సుమాత్రం యింకా రాలేదు. చెన్నపట్నంలో మోసం జాస్తి అనే మాట జ్ఞాపకానికిరాగా జేబులో పర్సు, సంచిలో సరుకు సరిచూసుకొన్నాను. వాటి ధర్మమా అని అన్నీ వున్నాయి.

—గుంటూరు గ్రామకాపురస్థుడు.
(మకాం : మద్రాసు)

## స్వర్గము

భార్య: ఆహాహా! ఎంత హాయిగా వుంది, యిక్కడ!! దీన్ని చూస్తూవుంటే నోటమాటలు కూడా రావు!

భర్త: అయితే యిక్కడే వుండిపోదాము.

* * *

మాస్టరు: అరే! అబ్బాయి మనలో ప్రతిదినం అభివృద్ధి చెందేదీ క్షీణించేది ఏదిరా!

విద్యార్థి: దినదినమూ క్షీణించేది ఆదాయం. అభివృద్ధి చెందేది ఖర్చు సార్!

—కె. బి. కృష్ణవేణి

* * *

భార్య: ఏమండీ! క్లబ్బుకి వెళ్ళినట్లున్నారు. ఇవాళ పేకాటలో ఏమాత్రం గెలిచారు?

భర్త: రోజు విడిచి రోజు గెలుస్తానని యిదివరకు ఎన్నిసార్లు చెప్పేను?

భార్య: అయితే రోజువిడిచి రోజే ఆడకూడదా అండీ?

—సి. బి. జగన్నాథరావు, కాకినాడ